క్లుప్తంగా

గంజాయి విక్రేత అరెస్ట్

ఉదయగిరి: సీతారామపురం మండలంలోని మద్యం బెల్టు దుకాణాలు, గంజాయి విక్రయ స్థావరాలపై సెబ్ సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. 200 గ్రాముల గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పలువురు బెల్ట్‌దుకాణాల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌కు అవకాశం

ఉదయగిరి: హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒకే కుటుంబానికి చెందిన వివాహమైన రెండు జంటలు వేర్వేరు కుటుంబాలుగా మ్యాపింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. తల్లిదండ్రులతో ఉన్న వివాహమైన కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా, ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తున్నా, ఫోర్‌వీలర్ వెహికల్ కలిగి ఉన్నా వృద్ధాప్య పింఛన్లు అందవుడీ కారణంగా అనేక మంది ఇబ్బంది పడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో, వారికి ఇబ్బంది లేకుండా ఈ అవకాశం కల్పించింది.

అ'పూర్వ' సమ్మేళనం




నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1979లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు. పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పాత స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. శంకరం, నజీర్‌బాషా, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్రంలోని యానాదుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస చక్రవర్తి, అధ్యక్షుడు పెంచలయ్య కోరారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన యానాదుల సంక్షేమ సంఘ జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస చక్రవర్తి మాట్లాడారు. గిరిజన కాలనీల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టే అంశంపై తీర్మానం చేశామని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా గౌరవ సలహాదారుడిగా సుబ్బారావు, జిల్లా చైర్మన్‌గా కృష్ణయ్య, అధ్యక్షులుగా సతీష్‌చంద్ర, మురళి, రమేష్, మహిళాధ్యక్షురాలిగా ఉషా, ప్రధాన కార్యదర్శిగా రమ్య, నగరాధ్యక్షురాలిగా వరలక్ష్మి, యశోదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేతలు వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, కళావతి, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమావేశం



నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ సమావేశాన్ని స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌శర్మ, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందానీబాషా, అసోసియేట్ ప్రెసిడెంట్ కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నిరంజన్, కమల్‌బాషా, మస్తాన్‌వలీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో నిధులు కేటాయించాలని వినతి

నెల్లూరు(వేదాయపాళెం): కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో చేతి వృత్తిదారులకు అధిక నిధులను కేటాయించాలని వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్ దయాకర్ కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని అంకయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. విజయవాడలో ఈ నెల 30న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు భారీగా తరలిరావాలని కోరారు. నేతలు శ్రీనివాసులు, సతీష్, బాలవెంకటేశ్వర్లు, శుభకుమార్, తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ, క్యాలెండర్లను జేమ్స్ గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రావు, జాకీర్‌హుస్సేన్ మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నేతలు పెంచలప్రసాద్, హరినారాయణ, నాగయ్య, మునికృష్ణయ్య, అంకయ్య, గిరిబాబు, సుమన్, రసూల్, సునీల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



గుడిపాడు సచివాలయం వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: రెవెన్యూ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధికారులకు తెలిపారు. గుడిపాడు సచివాలయం వద్ద గడప గడపకు మన ప్రభుత్వంపై ఆదివారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను తిప్పుకోకుండా రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తే వారు సంతోషంగా ఉంటారన్నారు. స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. తొలుత సచివాలయ వద్ద మొక్కలు నాటారు.

వాటర్‌ప్లాంట్ మంజూరుకు కృషి

గుడిపాడు ఎస్సీ కాలనీవాసులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యేకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యం ఆరబోతకు స్థలం కేటాయించండి

ధాన్యం ఆరబోసుకునేందుకు స్థలం కేటాయించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. గత కొన్నేళ్లుగా గ్రామంలోని ఆరెకరాల స్థలంలో ధాన్యం ఆరబోసుకుని మార్కెట్‌కు తరలించుకుంటున్నామని విన్నవించారు. త్వరలో జరగనున్న భూ పంపిణీలో సదరు భూమిని కేటాయించాలని కొందరు అధికారులకు అర్జీలు పెట్టుకున్నారని. దీని వల్ల ధాన్యం ఆరబోసుకునేందుకు ఇబ్బందులు పడుతామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ధాన్యం ఆరబోతకు రైతులకు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌కు సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ కాటం విజయలక్ష్మి, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కోటిరెడ్డి, రమణారెడ్డి, సూరా శ్రీనివాసులరెడ్డి, పులిమి వెంకట రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం



ఆత్మకూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



కావలిలో మంచి ప్రదాత చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సుందరరావు

కావలి రూరల్: రోడ్డు ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి సురక్షితంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సుందర్‌రావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వైద్యశాలల్లో మంచి ప్రదాత చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ఎటువంటి స్వలాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా క్షతగాత్రులకు సాయం చేయడానికి ముందుకొచ్చే వ్యక్తులను మంచి ప్రదాత అని పిలుస్తారన్నారు. క్షతగాత్రులకు సాయం చేయడానికి ముందుకొచ్చిన వ్యక్తులు పోలీసులు, అంబులెన్స్‌లకు ఫోన్ చేసినప్పుడు వారి వివరాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రథమ చికిత్స తెలిసి ఉంటే క్షతగాత్రులకు నిర్భయంగా చేయవచ్చునని తెలిపారు. అంబులెన్స్‌లు అందుబాటులో లేక స్వయంగా వైద్యశాలకు తీసుకొస్తే వైద్యసిబ్బంది వారిని ఎటువంటి వివరాలు అడగకూడదని, ఒక వేళ అడిగినా సహాయకులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కే కరుణాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు: వాహనచోదకులు డ్రైవింగ్ సమయంలో రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాములు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అభిరామ్ ఆస్పత్రి వద్ద అంబులెన్స్‌లు, ఆటో డ్రైవర్లకు ఆదివారం మంచి ప్రదాత చట్టంపై అవగాహన కల్పించారు. తొలుత అభిరామ్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మేకపాటి దీప్తి చేతుల మీదుగా జాతీయ రహదారి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి, ఆర్‌టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్రిపాడు మండలంలో సోమవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు శెట్టిసముద్రంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం 3 గంటలకు కంపసముద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వీఆర్వో మృతి

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న దాసరి లక్ష్మీనారాయణ(42) శనివారం రాత్రి మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనారాయణ అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. గత రెండేళ్లుగా ఆదూరుపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న ఆయన మృతిపై రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పేదల పాలిట పెన్నిధి లింగన్న

కొండాపురం: పేదలపాలి పెన్నిధిని మాజీ నక్సలైట్ గంటా లింగన్న అని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని సాయిపేటకు చెందిన గంటా లింగన్న అలియాస్ మూర్తన్న ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సాయిపేటలో లింగన్న స్మారక స్థూపాన్ని భార్య గంటా అనసూయమ్మ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రాలో పుట్టిన లింగన్న తెలంగాణలో ఆదివాసుల అభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. సీపీఐ ఎంఎల్ నాయకులు విజయకుమార్, లక్ష్మారెడ్డి, శ్యామల, పీ భాస్కర్, వెంకటేశ్వర్లు, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పట్టణానికి చెందిన బాలాజీ స్కూటీపై వేగంగా వెళ్తూ అడ్డు వచ్చిన వ్యక్తిని తప్పించబోయి డివైడర్‌కు ఢీకొని కిందపడిపోయి గాయపడ్డాడు. బీఎస్సార్‌సెంటర్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఎం శివశంకర్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించారు. స్కూటీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సీఐకు అభినందనలు

ఉదయగిరి: కావలిలో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ రాత పరీక్షకు పట్టణానికి చెందిన ఓ అభ్యర్థి హాల్‌టికెట్టు మరిచిపోయి హాజరయ్యాడు. ఇంటికెళ్లి తెచ్చుకునేందుకు సమయం లేక ఆందోళన చెందుతుండడాన్ని గమనించిన కలిగిరి సీఐ సాంబశివరావు తన సొంత వాహనం పంపి సకాలంలో హాల్‌టికెట్టు తీసుకొచ్చి పరీక్ష రాసేందుకు సహకరించారు. మరో ఏడుగురు అభ్యర్థులు ఆధార్ జెరాక్స్ లేకుండా పరీక్ష కేంద్రానికి రాగా సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఈ విషయాన్ని గమనించిన సీఐ తన సిబ్బంది ద్వారా జెరాక్స్ కాపీలు తెప్పించి హాల్‌కు పంపారు. ఈ విషయం తెలుసుకున్న కావలి డీఎస్పీ వెంకటరమణ సీఐని అభినందించారు.

బహుముఖ అభివృద్ధికి బాటలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



బట్టేపాడు సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తోడు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఆత్మకూరు నియోజకవర్గ బహుముఖ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. బట్టేపాడులో నూతనంగా నిర్మించిన సొసైటీ భవన నిర్మాణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బట్టేపాడు సొసైటీ ద్వారా కేవలం పంట రుణాలే కాకుండా బంగారు రుణాలు అందించేందుకు సహకార శాఖ చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. సోమశిల జలాశయంతో పాటు అందుబాటులో ఉన్న భూములు సద్వినియోగం చేసుకుని రానున్న కాలంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్యాచరణ ప్రారంభిస్తామన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ అమలు చేసిన ఫీజురీయింబర్స్‌మెంట్‌తో ప్రతి గ్రామంలో కనీసం పది మంది ఉన్నత చదువులు చదివి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఉద్యోగాలు సంపాదించి ఆర్థికంగా స్థిరపడ్డారని గుర్తుచేశారు. ఆ ఫలితాలు రానున్న రెండు, మూడేళ్లలో మరింతగా రానున్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డిపల్లికి చెందిన 57 మంది పేదలు గతంలో తమకు నెల్లూరుపాళెం జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారని, సకాలంలో ఇళ్లు నిర్మించుకోకపోవడంతో రద్దు చేశారని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడారు. అర్హులందరికీ తిరిగి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, షేక్ సర్దార్, ఆత్మకూరు, బట్టేపాడు, సొసైటీల అధ్యక్షులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వాసిపల్లి లక్ష్మీరెడ్డి, కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శంకర్‌బాబు, నాబార్డు డీడీఎం రవిసింగ్, ఆప్కాబ్ డీజీఎం శ్రీనివాసులు, పీడీసీ ఏజీఎం ప్రదీప్‌రెడ్డి, ఆత్మకూరు శాఖ మేనేజరు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, సానా వేణుగోపాల్ రెడ్డి, కోర్సిపాటి వెంకట్రామిరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకట రెడ్డి, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులు నాయుడు, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్జీఓ నేతల సమావేశం

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ సంఘ నేతలు కృషి చేస్తున్నారని ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు పేర్కొన్నారు. దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావుపై ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు విమర్శలు చేయడం తగదని సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి శ్రీనివాసరావు అడ్డుపడుతున్నారని ఆరోపించడం సిగ్గుచేటని విమర్శించారు. ఏపీజీఈఏ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు పోరాటం చేయాలని హితవు పలికారు. ఎన్జీఓ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు ఆంజనేయవర్మ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, కృష్ణంరాజు, పెంచలయ్య, శ్రీధర్‌రావు, మార్కండేయులు, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుడు రామిరెడ్డిని ఎన్జీఓ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్‌లో రామిరెడ్డిని సత్కరించారు. ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, కార్యదర్శి వెంకటస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కోశాధికారి వెంకటేశ్వర్లు, నిర్వహణ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాళ్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూర్చేందుకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పేదలకు నివేశన స్థలాలు, పక్కాఇళ్లు, రైతుభరోసా కేంద్రాలు,, నాడు–నేడు, విద్యాదీవెన, అమ్మఒడి, వసతిదీవెన, తదితర పథకాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందాయని వివరించారు. సర్పంచ్ వెంకయ్య, ఎంపీటీసీ అమిరిశెట్టి వెంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, తూపిలి పెంచలయ్య, సుంకే మాల్యాద్రి, మేకల శ్రీనివాసులు, ఉప్పాల మాచర్ల, బండ్ల సురేష్, సుందరరాజ్, అమిరిశెట్టి శ్రీనివాసులు, ఏసుపోగు బాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు సహకరించాలి

కావలి రూరల్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు అన్ని యూనియన్ల నాయకులు సహకరించాలని కావలి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు కోరారు. కావలి డిపోలో ప్రైవేట్ వాహనాల తాకిడితో ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతుండడంతో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రైవేట్ వాహనాలను లోనికి రానీకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కావలి డిపోలోని అన్నీ యూనియన్ల నాయకులతో మాట్లాడి డిపో ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ కూడా యూనియన్ల విభేదాలను విస్మరించి ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఆర్టీసీ ఆదాయంలో ఉంటే మన భవిష్యత్తు బాగుంటుందన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా



పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన కారు



సురక్షితంగా బయపడిన ఎంపీపీ కొండమ్మ దంపతులు

- సురక్షితంగా బయటపడిన కావలి ఎంపీపీ దంపతులు

కావలి: మండలంలోని కొత్తపల్లి వద్ద ఎంపీపీ ఆలూరు కొండమ్మ, శంకరయ్య దంపతులు ప్రయాణిస్తున్న కారు ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎంపీపీ దంపతులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు.. సిరిపురానికి చెందిన ఎంపీపీ ఆలూరు కొండమ్మ తన భర్త శంకరయ్యతో కలిసి గుడ్లూరు మండలం చిన్నలాట్రాపికి కారులో ఆదివారం ప్రయాణమయ్యారు. శంకరయ్య డ్రైవింగ్ చేస్తుండగా ఎంపీపీ పక్కన కూర్చుని ఉన్నారు. కొత్తపల్లి సమీపంలో శంకరయ్య బ్రేక్ వేయబోయి పొరపాటున యాక్సిలేటర్‌పై కాలు వేయడంతో అదుపుతప్పి రోడ్డుపక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎంపీపీ దంపతులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు గమనించి వారి వద్దకు చేరుకుని పరామర్శించారు. కాగా ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎంపీపీ దంపతులను ఫోన్‌లో పరామర్శించారు.

కల్తీ లేని ఆహార పదార్థాలతోనే ఆరోగ్యం



నెల్లూరు(అర్బన్): కల్తీ లేని ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలమని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్ర ట్రస్ట్ చైర్మన్ రాజగోపాల్ పేర్కొన్నారు. హరనాథపురంలోని శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జక్కా వెంకయ్య వినియోగదారుల పరస్పర సహకార సంఘ మూడో సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన ఆహార పదార్థాలను అందించడం, గిట్టుబాటు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో సంఘాన్ని స్థాపించారని వివరించారు. అనేక మంది విశ్రాంత ఉద్యోగులు, తదితరులు వినియోగదారుల సంఘంలో స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా పరంధామయ్య, వెంకటేశ్వర్లుతో పాటు ఏడుగురు కొత్త డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నిర్వాహకులు బలరామ్, డాక్టర్ రాజేశ్వరరావు, హరిత, విజయలక్ష్మి, విద్యాచరణ్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేశవులునగర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసును ఆదివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కేశవులునగర్‌కు చెందిన సుజాత తన కుమార్తెతో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి ఈ నెల 14న వెళ్లారు. అదే రోజు రాత్రి కుమారుడు సైతం వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి బీరువాలోని 13 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదును అపహరించుకెళ్లారు. ఈ నెల 18న నెల్లూరు చేరుకున్న ఆమెకు ఆభరణాలు, నగదు కనిపించలేదు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఆదివారం ఇంటికొచ్చారు. అనంతరం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని బాలాజీనగర్‌లోని వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకుడు నారాయణ దాశరథి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. తొలుత పంచామృతాభిషేకాలను నిర్వహించారు. దాదాపు 600 మందికిపైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా బాలవెంకటఅశోక్, అనూరాధ దంపతులు వ్యవహరించారు. కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, కిషోర్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.